నమస్తే తెలంగాణ

సూర్యాపేట

I | నల్లగొండ, గురువారం 10 ఏప్రిల్ 2025 | SURYAPET



నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ఆర్టీసీ బస్సుకు బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను అంటిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## బీఆర్ఎస్ రజతోత్సవ సభతో దేశం చూపు తెలంగాణ వైపు

- ఢిల్లీ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- పదేండ్లలో జరిగిన అభివృద్ధి కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- వాహనాలకు బీఆర్ఎస్ రజోత్సవ సభ పోస్టర్ల అంటింపు

నకిరేకల్, ఏప్రిల్ 9 : బీఆర్ఎస్ రజోత్సవ సభతో దేశం చూపు తెలంగాణ వైపు పడుతుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఢిల్లీ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధి కేసీఆర్ దూర దృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను బుధవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆర్టీసీ బస్సులు, ఆటోలకు స్వయంగా అంటించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ అడ్డగోలు హామీలతో అధికారలోకి వచ్చిన కాంగ్రెస్‌కు సగం సగం పనులు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రుణ మాఫీ, రైతు బంధు సగంలోనే ఆపారని పేర్కొన్నారు. అనేక పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం సాధించి, అన్ని రంగాల్లో ముందు నిలిపిన కేసీఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రజోత్సవ సభకు నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సందేశాన్ని వినేందుకు అంతా ఆసక్తి ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రతి కార్యకర్త ఇంట్లో పండుగలా భావిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కట్టంగూర్ మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాచకొండ వెంకట్, గుర్రం గణేశ్, నాయకులు పెండెం సదానందం, సామశ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేశం, యానాల లింగారెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, అవిరెండ్ల జనార్దన్, చిట్యాల అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

## రజతోత్సవ సభకు సబ్బండ వర్గాలు సిద్ధం

- బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 9 : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల ప్రారంభ సూచికగా ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బహిరంగ సభను పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న రైతులు, యువత, సామాన్య ప్రజలు.. ఇలా సబ్బండ వర్గాల వారు రజతోత్సవ సభలో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఆ మేరకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లే ఏర్పాట్లలో నిమగ్నమవ్వాలన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రుణ మాఫీ, రైతు భరోసా, ఇప్పుడు పంటకు మద్దతు ధర అందించడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ మోసిన్‌అలీ, సంపత్, ధనావత్ చిట్టిబాబునాయక్, అన్నభీమోజు నాగార్జునచారి, జొన్నలగడ్డ రంగారెడ్డి, ఎండీ యూసుఫ్, కుందూరు వీరకోటిరెడ్డి, మగ్దుమ్‌పాషా, మట్టపల్లి సైదయ్యయాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, ఇలియాస్, ఆంగోతు హాతీరాంనాయక్, కుర్ర సేవ్యానాయక్, చిర్ర మల్లయ్యయాదవ్, పోకల రాజు, నిమ్మల నవీన్‌రెడ్డి, చౌగాని భిక్షంగౌడ్, నంద్యాల శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.



హాలియాలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

## బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి


- పాలనలో కాంగ్రెస్ ఫెయిల్
- రానున్నది బీఆర్ఎస్ సర్కారే
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్
- నాగార్జునసాగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశం

హాలియా, ఏప్రిల్ 9 : బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల భగత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం హాలియాలో ఆ పార్టీ సాగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ 25 లక్షల మందితో వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను తలపెట్టిందన్నారు. 27న నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురేయాలని కోరారు. అనంతరం బహిరంగ సభకు తరలిరావాలన్నారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా ఫెయిల్ అయ్యిందని విమర్శజంచారు. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతో ఉన్నారన్నారు. 2028లో ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోనికి రావడం ఖాయమని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని సూచించారు. కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కురాకుల వెంకటేశ్వర్లు, తాటి సత్యపాల్, నాగులవంచ తిరుపతిరావు, రవినాయక్, పిడిగం నాగయ్య, హాలియా పట్టణాధ్యక్షుడు వడ్డే సతీశ్‌రెడ్డి, యడవల్లి మహేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బొల్లం రవి, రాంఅంజయ్య యాదవ్, మాజీ సర్పంచ్‌లు, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధర పెంపుపై భగ్గుమన్న జనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

సూర్యాపేట, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : వంట గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. రెండో రోజు మంగళవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసనలు జరిగాయి. నల్లజెండాలు, నల్ల రిబ్బన్లు ధరించి వీధుల్లోకి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్యాస్ ధర పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారని కమ్యూనిస్టు నాయకులు ధ్వజమెత్తారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లను ఉంచి నిరసన తెలిపారు. హుజూర్‌నగర్, కోదాడ, నల్లగొండ, నకిరేకల్, చిలుకూరు, మేళ్లచెర్వు, నడిగూడెంలోనూ ఆందోళన చేపట్టారు. యాదగిరిగుట్ట మండలం గుండ్లపల్లి, గౌరాయిపల్లిలో సీపీఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు 925 రూపాయలకు చేరిందంటే కేంద్ర ప్రభుత్వానికి పేదలపై ఉన్న బాధ్యత అర్ధమవుతుందని విమర్శించారు. కేంద్రం నిర్వాకంతో తిరిగి కట్టెల పొయ్యి వైపు జనం మళ్లే రోజులు వచ్చాయని మండిపడ్డారు.




నల్లగొండలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

## నకిలీ పత్తి విత్తనాల కలకలం!

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 : మోటకొండూర్ మండల కేంద్రంలో నకిలీ పత్తి విత్తనాలు కలకలం రేపాయి. గుట్టుచప్పుడు కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు ఇద్దరు వ్యక్తులను మంగళవారం అర్ధరాత్రి వికారాబాద్ జిల్లాకు చెందిన ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది. సమారు 180 కేజీల బీటీ3 నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీను అనే వ్యక్తి ప్రభుత్వ నిషేధిత నకిలీ విత్తనాలు వికారాబాద్‌తో పాటు మోటకొండూర్ మండలం, జిల్లాలోని వలిగొండ, ఇతర మండలాల్లో విక్రయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్ఓటీ దాడిలో బీటీ విత్తనాలు స్వాధీనం చేసుకుని అక్కడి వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా శ్రీను విక్రయించాడని తెలిపినట్లు సమాచారం. దాంతో సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా శ్రీనును వలిగొండలో అదుపులోకి తీసుకుని విచారించగా మోటకొండూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పాడు. పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకొని వికారాబాద్‌కు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది.

# గోరంత పంపిణీకి కొండంత ప్రచారం

### పబ్లిసిటీ యావలో ప్రభుత్వం



### ఉమ్మడి జిల్లాలో ఫ్లెక్సీల ఖర్చు రూ.5కోట్లకు పైనే

- రైతుభరోసా, రుణమాఫీ వివరాల ఫ్లెక్సీల ఏర్పాటుకు నిర్ణయం
- ఆ డబ్బులు అర్హులకు ఇస్తే కొందరికైనా లబ్ధి చేకూరుతుందంటున్న రైతులు

**అలివికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆచరణను మరిచి ప్రచార ఆర్భాటంపై దృష్టి పెడుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచార యావతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేస్తుండడంపై జనం మండిపడుతున్నారు. 30 శాతం కూడా పూర్తి చేయని రైతుభరోసా, నలభై శాతం కూడా కాని రుణమాఫీ పథకాల అమలు ప్రచారం కోసం ప్రభుత్వం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.5 కోట్లకుపైగా ఖర్చు చేస్తుండడం విడ్డూరం. ఈ రెండు పథకాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు గ్రామగ్రామాన లబ్ధిదారుల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసేందుకు టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసింది.**

– సూర్యాపేట, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ)

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు ప్రజలకు ఏది అవసరమో అది అందించారు. ఏ ఒక్కరూ అడగకుండానే అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేశారు. ఆరు గ్యారెంటీలు, అనేక హామీలతో గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. కేసీఆర్ సర్కారులో ప్రజలకు అందిన పథకాలను సైతం కొనసాగించని దుస్థితి. పలు పథకాలను గొప్పగా ప్రారంభించి మధ్యలోనే మంగళం పాడుతున్నది. పైగా, అరకొరగా అమలు చేసిన పథకాలను ఏదో గొప్పగా చేసినట్లు ప్రచారం చేసుకునేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో దాదాపు ఐదు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. రైతుభరోసా, రుణ మాఫీ అందని రైతులు ఉమ్మడి జిల్లాలో లక్షల్లో ఉన్నారు. కానీ, ఇప్పటికే ఇచ్చిన కొద్దిమంది లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీలను గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో 481, నల్లగొండ జిల్లాలో 868, యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామపంచాయితీలు ఉండగా, మొత్తం 1771 పంచాయతీల్లో 6x4 సైజులో ఫ్లెక్సీల ఏర్పాటు చేయనున్నారు. ఫ్లెక్సీలో పట్టే పేర్లను బట్టి ఎన్ని అవసరపడతాయో అన్నింటిని మూడు చోట్ల ఏర్పాటు చేస్తారు. ఇలా సూర్యాపేటలో 52 వేలు, నల్లగొండ జిల్లాలో 61,089, యాదాద్రి భువనగిరి జిల్లాలో 39వేలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ఫ్లెక్సీకి రూ.300 నుంచి 350 రూపాయల ఖర్చు అవుతుందనే అంచనాలతో ఇప్పటికే మూడు జిల్లాల్లో కలిపి దాదాపు రూ.5కోట్లతో ఎస్టిమేషన్లు పూర్తి చేసి టెండర్లు పిలిచినట్లు సమాచారం. కాగా, అంతంతమాత్రంగా అమలు చేసిన రైతుభరోసా, రుణమాఫీపై ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం అంటే ప్రజా ధనం వృథా చేయడం తప్ప మరోటి కాదని రైతులు మండిపడుతున్నారు. అందుకయ్యే ఖర్చుతో కొద్దిమంది రైతులకైనా లబ్ధి చేకూర్చవచ్చనే చెప్తున్నారు.

### కాంగ్రెస్‌తో రైతులకు ఒరిగిందేమీ లేదు



కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు, నాయకుల ప్రచార ఆర్భాటం తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదు. రైతు భరోసా రైతులకు అందనే లేదు. ఇప్పటి వరకూ ఏ ఊళ్లోనూ రుణమాఫీ పూర్తిగా జరుగలేదు. చనిపోయిన రైతు కుటుంబాలకు రైతు బీమా అందడం లేదు. కేవలం వానకాలానికి సంబంధించి, అదీ కొద్దిమందికే రైతు భరోసా ఇచ్చారు. యాసంగి సంబంధించి పెట్టుబడి సాయం ఊసేలేదు. పంట చేతికి వచ్చినా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మద్దతు ధర కంటే తక్కువ మిల్లులకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తున్నది. ఇవన్నీ పట్టించుకోవడం మాని అరకొర పనులకు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉంది.

**- పెరుమాళ్ల సతీశ్, రైతు, యల్లాపురం, పాలకవీడు మండలం**

## ఐకేపీలో దొంగలు పడ్డారు

- 20 క్వింటాళ్ల ధాన్యం మాయం
- పట్టింపులేని నిర్వాహకులు



బొప్పారం ఐకేపీ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లిన ధాన్యం రాశిని చూపుతున్న రైతు

కేతేపల్లి, ఏప్రిల్ 9 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యానికి రక్షణ లేకుండా పోయింది. కేతేపల్లి మండలం బొప్పారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో మంగళవారం రాత్రి ధాన్యం చోరీ జరిగింది. ఇక్కడ వారం రోజుల కిందట కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఊరి పక్కన గల చెరువు దగ్గరున్న ఖాళీ స్థలంలో రైతులు వడ్లు పోశారు. ఆ స్థలం పూర్తిగా నిండిపోవడంతో కాసనగోడు గ్రామం కొనుగోలు కేంద్రం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కొందరు రైతులు ధాన్యం పోసుకున్నారు. రెండు రోజుల నుంచి రాత్రిళ్లు గుర్తుతెలియని దండగులు ఇక్కడి నుంచి రైతుల ధాన్యం దోచుకుపోతున్నారు. సోమవారం రాత్రి ఎంగలి గోపి, పొడిచేటి సోములు అనే రైతుల ధాన్యం రాసుల్లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి పొడిచేటి సోములు, పొడిచేటి శంకర్, చొగోని శ్రీరాములు అనే రైతుల ధాన్యం సుమారు 20 క్వింటాళ్ల వరకు దుండగులు ఎత్తుకుపోయినట్లు బాధిత రైతులు వాపోయారు. దీనిపై కొనుగోలు కేంద్రం నిర్వాహకులను నిలదీస్తే ఎవరి ధాన్యానికి వారే రక్షణగా ఉండాలని, తామేమీ చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, రాత్రిళ్లు కాపలాదారులను నియమించకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని రైతులు మండిపడుతున్నారు. ధాన్యం చోరీకి గురవడంపై బుధవారం కేతేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- హామీలన్నింటినీ అమలు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా





కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 9 : రైతాంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతు సంఘం నాయకులు ఆందోళనకు దిగారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులందరికీ రూ.2లక్షల వరకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయాలని, సాగులో ఉన్న భూములన్నింటికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాలు, వడగండ్లకు పంట నష్టపోయిన రైతులకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. గుండాల మండలం షాపురం-వంగాల మధ్య ఉన్న అసంపూర్తిగా ఉన్న కాల్వను పూర్తి చేసి నవాబుపేట రిజర్వాయర్ ద్వారా తాగునీరు అందించాలన్నారు. ప్రధాన మంత్రి మోదీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం అమలు చేయాలని కోరారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం విరమించుకోవాలని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని 6 వేల నుంచి 18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జగన్మోహన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పుల కొమురయ్య, ఎలగందుల అంజ య్యా, జిల్లా సహాయ కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి, నాయకులు నరికే యాదయ్య, తెడ్డు ఆంజనేయులు, బోదాసు స్వామి, గుర్రం పద్మా రెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, సోమన ఐలయ్య, కూర వెంకటేశ్, ఎనగండ్ల రాజప్ప పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ వినతిపత్రం



రావులపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి, ఏప్రిల్ 9 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు హామీలని అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ చేశారు. ఈ మేరకు బుధవారం తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నదని విమర్శించారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండాగాని రాములుగౌడ్, కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, మండల నాయకులు తునికి సాయిలు, గుడిపాటి వీరయ్య, మట్టిపెల్లి కవిత, మల్లెపాక రాములు, కన్నెబోయిన ప్రసాద్, సోమేశ్, వీరు, శంకర్, నాగు, యాదగిరిరెడ్డి, యాకూబ్, చింతకుంట్ల నరేశ్ పాల్గొన్నారు.

## యువ వికాసానికి దరఖాస్తులు అంతంతే..

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటి వరకు 23,476 అప్లికేషన్లే..
- ఎస్సీ కార్పొరేషన్‌లో 3,644 యూనిట్లకు 6076 దరఖాస్తులు
- అనేక అనుమానాలే కారణం
- దరఖాస్తుకు ఈ నెల 14 వరకు గడువు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదు. అన్ని విభాగాలు కలుపుకొని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటి వరకు 23,476 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ నెల 14 చివరి తేదీ కావడంతో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాజీవ్ యువ వికాసం కింద ఆరు కేటగిరీల్లో రాయితీలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మూడింటికి బ్యాంకు రుణాలను అనుసంధానం చేయనుంది. ఆ మేరకు విధి విధానాలను విడుదల చేసింది. మహిళలు, దివ్యాంగులు, తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలు, ఎస్సీ వర్గీకరణ ఉద్యమకారులు, నైపుణ్యం గల వారికి ప్రాధాన్యం కల్పించింది. ఈ నేపథ్యంలోనే అర్హుల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటి వరకు 23,476 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇందులో ఎస్సీ కార్పొరేషన్‌కు 6,076, ఎస్టీ కార్పొరేషన్‌కు 1,607, బీసీ కార్పొరేషన్‌కు 14,423, ఈబీసీకి 404, మైనార్టీకి 930, క్రిస్టియన్‌కు 36 అప్లికేషన్లు అందాయి. ఒక్క ఎస్సీ కార్పొరేషన్ మినహా ఏయే శాఖకు ఎన్ని యూనిట్లు మంజూరయ్యాయో ఇప్పటికీ స్పష్టత లేకున్నా అధికారులు మాత్రం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో 3,644 యూనిట్లతో రూ.50.30 కోట్ల సబ్సిడీకి ఆమోదం తెలిపారు. ఇందుకోసం 5,321 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి. బ్యాంకు లింకేజీతో రూ. లక్ష, రూ. రెండు లక్షల యూనిట్లకు అతి తక్కువగా అప్లికేషన్లు చేసుకున్నారు. ఈ యూనిట్లకు 90శాతం, 80 శాతం సబ్సిడీ కూడా వర్తిస్తుంది. బ్యాంకు రుణం లేకుండా చిన్న తరహా యూనిట్లు స్థాపించేందుకు రూ.50వేల సబ్సిడీ పథకానికి కూడా అతి తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. కాగా, రాష్ట్రస్థాయిలో జీఓ ఇచ్చినప్పటికీ జిల్లా స్థాయిలో దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేయడంతో ఆలస్యం జరిగింది. మరో వైపు అనేక హామీలను ఎగ్గొట్టిన ప్రభుత్వం రుణాలు ఇస్తుందన్న నమ్మకం లేకపోవడం, ఇచ్చినా అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకే ప్రాధాన్యం ఉంటుందనే ప్రచారంతో దరఖాస్తు చేసుకునేందుకు చాలామంది ముందుకు రావడం లేదని తెలుస్తున్నది.

## సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 9 : మండలంలోని జలాల్ పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో స్వల్పకాలిక సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల కాలపరిమితి కలిగిన మొబైల్ ఫోన్ రిపేరింగ్ (ఎస్ఎస్సీ), సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, మెయింటెనెన్స్, హౌస్ వైరింగ్ (నెల కాలపరిమితి, ఎస్ఎస్సీ), క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్, జర్దోజి అడ్వాన్స్ (ఎనిమిదో తరగతి) కోర్సులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు ఈనెల 15న ఉదయం 10 గంటలకు రామానంద తీర్థ సంస్థలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సంస్థలో హాస్టల్ వసతి కలదని, ఫీజు నెలకు రూ. 3,900 ఉంటుందని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 913390 8222, 9948 466111 నంబర్లను సంప్రదించాలని కోరారు.

